

సాక్షి
ఒడిశా
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,10,431
బంగారం	2 గ్రాముల 450 మిల్లీ గ్రాములు
వెండి	38 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ఆలివ్ రిడ్లే సంరక్షణకు చర్యలు

ప్రస్తుతం అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే సముద్ర తాబేళ్ల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- 8లో



రాజీయే రాజమార్గం

రాష్ట్రవ్యాప్తంగా పలు కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

భయాందోళనలో ప్రజలు

- బీటలువారిన థర్మల్ ప్లాంట్ బూడిద చెరువు
- పొలాలు, గ్రామాల్లోకి బురద బూడిద



పంట పొలాల్లో పేరుకుపోయిన బురద బూడిద

భువనేశ్వర్: ఒడిశా పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఓపీజీసీ) థర్మల్ ప్లాంట్‌లోని బూడిద చెరువు బీటలు వారింది. దీంతో శనివారం ఝార్సుగుడ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో బురద బూడిద ప్రవాహంతో వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయి. ఓపీజీసీ ప్లాంట్‌లోని 3వ నంబర్ బూడిద చెరువులో 20 అడుగుల పొడవునా బీటలువారినట్లు తెలుస్తోంది. ఫలితంగా లఖన్‌పూర్‌లోని రెంగాలితో సహా కనీసం మూడు గ్రామాల్లో వ్యవసాయ భూమి బురద బూడిద ప్రవాహంతో నిండిపోయింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. పలు ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు సమాచారం. పరిసర ప్రాంతాల్లో విషపూరిత వాతావరణం వ్యాపిస్తోందని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది. శారదాపల్లి శివారులో ఉన్న పొలాల్లోకి చేరిన బూడిద నీరు గ్రామంలోకి ప్రవేశించింది. దీంతో చాలా మంది ప్రజలు తమ వస్తువులతో గ్రామాన్ని విడిచిపెట్టడానికి సిద్ధమవుతున్నారు. సీనియర్ ఒడిశా పవర్ జనరేషన్ కార్పొరేషన్ అధికారులు సమస్య పరిష్కారానికి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఇంటి ఆవరణలో ఒక పక్కకు ఒరిగిన ట్రక్కు

జయపురం: సమితిలోని అంబాగుడ గ్రామంలో ఒక కుటుంబానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. 26వ జాతీయ రహదారి పక్కనున్న అంబాగుడ గ్రామంలోని ఇక ఇంటి ఆవరణలోకి ఇసుక రావాణా చేస్తున్న ట్రక్కు అదుపు తప్పి దూసుకుపోయింది. ఆ సమయంలో ఇంటి వరండాలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనపై ఇంటి యజమాని రమేష్ సాహు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి ట్రక్కును తొలగించారు. అనంతరం ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. గతంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయని సాహు గుర్తు చేసుకున్నారు. 26వ నంబర్ జాతీయ రహదారి అంబాగుడలో ఐటీఐ, ఉన్నత పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు, ప్రజలు ప్రయాణాలు చేస్తున్నా రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తి మృతి



బ్రిజేష్‌పై ఎలుగుబంటి దాడి చేస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్‌లో) బ్రిజేష్ మృతదేహం

కొరాపుట్: ఎలుగుబంటి దాడిలో భారతమాల కార్మికుడు మృతి చెందాడు. శనివారం ఉదయం నబరంగ్‌పూర్ జిల్లా బొత్రా గ్రామం వద్ద ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రం మహిర్ ప్రాంతానికి చెందిన బ్రిజేష్ కుమార్ ద్వివేది (35) విధి నిర్వహణకు వెళ్లాడు. తీవ్రమైన పొగ మంచు ఉండడంతో ఎలుగుబంటి అతని సమీపంలోకి రావడం గమనించలేదు. దీంతో ఎలుగు అకస్మాత్తుగా అతనిపై దాడిచేసి లాక్కుపోయింది. బలిష్టమైన ఎలుగు కావడంతో బ్రిజేష్ నిస్సాయకుడిగా మిగిలిపోయాడు. సాటి కార్మికులు రాళ్లతో కొడుతున్నప్పటికీ అతనిని వదలకుండా తల భాగం తినడం ప్రారంభించింది. చివరకు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి అటవీ శాఖకి సమాచారం ఇచ్చారు. ఎంతో కష్టం మీద ఎలుగుని అక్కడి నుంచి తరిమి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎలుగు కోసం అధికారులు గాలింపులు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్ వరకు రూ.20,000 కోట్లతో నాలుగు అంచెల ఎకనామిక్ కారిడర్‌ను భారతమాల పేరిట నిర్మిస్తున్న విషయం పాఠకులకు విధితమే.

- మంత్రి సరకను కలిసిన విద్యార్థులు
- కాలి నడకన 18 కి.మీ ప్రయాణం
- పాఠశాలలో సమస్యలు ఏకరువు
- దర్యాప్తు చేయాలని మంత్రి ఆదేశాలు

సమస్యల సుడి.. బొడరాయిసింగి బడి..!



బొడొరాయిసింగి ఆశ్రమ పాఠశాల

రాయగడ: సారూ.. మా గోడు వినిపించుకోండి. మా పాఠశాలలో సరిగ్గా చదువులు సాగడం లేదు. చక్కని భోజనం కూడా పెట్టడం లేదు. మాకు పనులు చెబుతూ వేధిస్తున్నారని చెమ్మగిల్లిన కళ్లతో విద్యార్థులు తమ సమస్యలను రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక దృష్టికి తీసుకొచ్చారు. తరగతులకు వెళ్లకుండా సరాసరి తమ బాధలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సుమారు 18 కిలోమీటర్ల దూరం కాలి నడకన ప్రయాణించారు. తెల్లవారుజాము 3.30 గంటలకు పాఠశాల నుంచి బయల్దేరిన విద్యార్థులు కలెక్టర్ కార్యాలయానికి ఉదయానికి చేరుకున్నారు. ఈ సంఘటన రాయగడ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రానికి సుమారు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి బొడరాయిసింగి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 14 మంది విద్యార్థులు కాలినడకన రాయగడకు చేరుకున్నారు. అయితే కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నా రెండో శనివారం అవ్వడం వలన కార్యాలయాలు మూసివేసి ఉండడంతో నిరాశ చెందారు. ఎవరైనా అధికారులు వస్తారేమోనని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో కూర్చున్నారు. విషయం తెలుసుకున్న పత్రికా విలేకరులు అక్కడికి చేరుకుని విద్యార్థులను కలిసి ఎందుకు వచ్చారని ఆరా తీశారు. దీంతో వారంతా బొడొరాయిసింగి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 7వ తరగతి విద్యార్థులమని, తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించేందుకు వచ్చామని వివరించారు. అయితే కార్యాలయం సెలవు కావడంతో సమీపంలోని సర్క్యూట్ హౌస్‌లో ఉన్నటువంటి మంత్రిని కలవాలని విలేకరులు సూచించారు.



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సరక



కలెక్టర్ కోసం కార్యాలయం వద్ద వేచివున్న విద్యార్థులు

సమస్యలు తెలుసుకున్న మంత్రి

ఒకేసారి ఇంతమంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లకుండా తనను కలిసేందుకు ఎందుకు వచ్చారని మంత్రి సరక వారిని లోపలికి పిలిచి వివరాలు అడిగారు. కొంతమంది విద్యార్థులు మంత్రితో మాట్లాడేందుకు భయపడడంతో మంత్రి చొరవ తీసుకొని ఆదివాసీ భాషలో వారితో మాట్లాడారు. వారి భుజాన చేయివేసి ఆప్యాయంగా ఏం జరిగిందో చెప్పమని అడిగారు. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా తమ సమస్యలను చెప్పడం ప్రారంభించారు. గత కొద్ది నెలలుగా తమ పాఠశాలలో వేధింపులు ఎక్కువయ్యాయని ఏకరువు పెట్టారు. పనులు చెబుతూ హెచ్‌ఎం తమను ఇబ్బంది పెడుతున్నారని, అదేవిధంగా చెబుతున్న పాఠాలు కూడా తమకు సరిగ్గా అర్థం అవ్వడం లేదని వివరించారు. ప్రతీ వారంలో రెండు సార్లు గుడ్లు, మాంసం పెట్టాల్సి ఉన్నా, అవి తమకు అందడం లేదని వాపోయారు. ఇదేంటని అడిగితే తమపై కన్నెర్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏదో దొరికిన భోజనాన్ని చేసుకుని మనసారా కునుకు తీస్తామంటే, నిద్రించేందుకు మంచాలు కూడా సరిగ్గా లేవన్నారు. సమస్యలు విన్నటువంటి మంత్రి సరక పిల్లలకు నచ్చజెప్పి పాఠశాలకు వెళ్లమని, సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అధికారులకు ఆదేశాలు

ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమస్యలపై స్పందించిన మంత్రి సరక వెంటనే జిల్లా అదనపు సంక్షేమ శాఖ అధికారి మలయ రంజన్ చిన్నొరాను పిలిపించి వివరాలు అడిగారు. ఆ ఆశ్రమ పాఠశాలలో దర్యాప్తు చేసి నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. తక్షణమే పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపరచాలని స్పష్టం చేశారు.

చర్యలు తప్పవు

విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన మీదట ఆరోపణలు వాస్తవమైతే దోషులపై చర్యలు తీసుకుంటామని విలేకరులతో మంత్రి సరక తెలియజేశారు. హెచ్‌ఎం తీరును సైతం విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చారని దీనిపై కూడా దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు. కాగా పిల్లలకు పనులు చెప్పడం, వేధించడం వంటివి చేయకూడదని స్పష్టం చేశారు. చదువుకునేందుకు వచ్చిన విద్యార్థులను సక్రమంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఏదిఏమైనప్పటికీ దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



దుంపల బస్తాలు మోస్తున్న విద్యార్థులు (ఫైల్)

అందాల లోకం

ఓ ఆదివారం సంధ్యవేళ అలలు పాదాలను ముద్దాడుతూ ఉంటే అనంత జలనిధిని చూడడం ఎంత ఆనందం. స్నేహితులు, బంధువులతో సహపంక్తిగా కూర్చుని మనసు నిండా భోజనం చేయడం ఎంత సంతృప్తి. పిల్లాపాపలతో కలిసి సెలవు రోజున ఓ కోవెలకు వెళ్లి దేవుడి ఆశీస్సులు తీసుకుంటే ఎంత సంతోషం. వన భోజనాలు కేవలం ఆనవాయితీనే కాదు అవసరం కూడా. గజిబిజి బతుకుల్లో అలసిపోయిన జీవులకు పిక్‌నిక్ ఓ టానిక్‌లా పనిచేస్తుంది కదా. అందుకే రాష్ట్ర సరిహద్దులోని కొన్ని ప్రదేశాలు వన భోజనాలకు స్వాగతిస్తున్నాయి. ఎప్పుడూ వెళ్లే ప్రదేశాలు బోరు కొడితే ఈ స్పాట్లు ప్రయత్నించాల్సిందే.



బీచ్‌లో సేద తీరేందుకు ఏర్పాటు చేసిన విశ్రాంతి శాలలు

- సరిహద్దులో ఆకర్షిస్తున్న అందాలు
- బీచ్‌లు, ఆధ్యాత్మిక ప్రదేశాలు
- వన భోజనాలకు అనువైన ప్రాంతాలు

ఇచ్ఛాపురం రూరల్:

ఒకవైపు విశాలమైన సాగరం తీరం.. మరోవైపు ఏపుగా పెరిగి ఆకాశాన్ని తాకే సరుగుడు చెట్లు, సముద్ర అందాలను తిలకించేందుకు వరిగడ్డితో ఏర్పాటు చేసిన విశ్రాంతి పాకలు, పిల్లాపాపలతో రోజంతా గడిపేందుకు కుటీరాలు, చిన్నారులు ఈత కొట్టేందుకు మంచినీటి సరస్సు. ఒక్క మాటలో చెప్పాలంటే అచ్చం విశాఖపట్నం బీచ్‌ను తలదన్నేలా మౌలిక సదుపాయాలతో అలరించే బీచ్ 'సున్నాపుర్ ఇకో రీట్రీట్'. ఇచ్ఛాపురం మండలం పెద్దలక్ష్మీపురం గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరం, ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉన్న ఈ బీచ్ రెండేళ్ల నుంచి ప్రాచుర్యం పొందింది. గతంలో సాధారణ బీచ్‌గా ఉండే ఈ ప్రాంతం ఇప్పుడు విద్యుత్ వెలుగులతో, రాతి కట్టడాలతో పర్యాటకుల మనస్సును ఇట్టే దోచుకుంటుంది. పర్యాటకులకు ఇబ్బంది కలుగకుండా ఒడిశా ప్రభుత్వం డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ఈ బీచ్‌కు వెళ్లాలంటే ఇచ్ఛాపురం నుంచి 16 కిలో మీటర్ల తారు రోడ్డు సౌకర్యం ఉంది. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు.



సున్నాపురం ఎకో రీట్రీట్



పర్యాటకుల విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన పార్క్

కొండలెక్కగలవా..?

సుమారు రెండున్నర కిలోమీటర్ల ఎత్తులో ఉండే కొండపై కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు, పర్యాటకులు బారులు తీరుతున్నారు. ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్ర గ్రామానికి ఐదు కిలో మీటర్ల దూరంలో, ఇచ్ఛాపురం మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల ఒడిశా ప్రాంతంలో ఉన్న ఈ కొండను 'బాలాకుమారి కొండ'గా పిలుస్తారు. కొండపైనే చిన్నపాటి భవనంలో బాలాకుమారి అమ్మవారు కొలువై ఉన్నారు. ఎత్తైన కొండపైకి వెళ్లాలంటే కార్లు, 150 సీసీ ద్విచక్ర వాహనాలపై మాత్రమే వెళ్లగలం. బస్సులు, ఆటోలు, మినీ బస్సులు, టాటా మ్యాజిక్ వాహనాలపై వచ్చే పర్యాటకులు కొండ దిగువన పార్క్ చేసి కొండపైకి నడక దారిన వెళ్లాల్సిందే. కొండపైకి వెళ్లాక అమ్మవారిని దర్శించేందుకు సుమారు వెయ్యి మెట్లు ఎక్కాల్సిందే. పర్యాటకులు గడిపేందుకు కొండపైన పార్క్‌ను ఏర్పాటు చేయగా, పిక్నిక్‌కు అనువుగా విస్తారమైన, ఆహ్లాదకరమైన కొండలు, గుట్టలు ఉండటంతో ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి వందలాది మంది పర్యాటకులు ఈ ప్రాంతానికి వెళ్తుంటారు.



పర్యాటకులకు ఏర్పాటు చేసిన విడిది



కొండపై పిక్నిక్ స్పాట్

దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు

బరంపురం: గంజాం జిల్లా గొళంతర పోలీసుస్టేషన్ పరిధి ఘటకేశ్వర్ రహదారిలో శుక్రవారం జరిగిన దోపిడి ఘటనకు సంబంధించి దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి బసంత్ కుమార్ సెఠి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి ఘటకేశ్వర్ రహదారిలోని ఒక ఇంట్లో దోపిడి జరిగింది. దీంతో బాధితుడు గొళంతరా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు బరహ బసంతి సత్తపతిని అరెస్టు చేసి, అతడి వద్దనుంచి రూ.1.18 లక్షల దోపిడీ సొత్తును రికవరీ చేశారు.



అరెస్టైన దొంగ, రికవరీ చేసిన డబ్బును చూపిస్తున్న పోలీసులు

సులభ దర్శనానికి ఏర్పాట్లు



సేవా సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని పలు సేవలు
- శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి రంజన కుమార్ దాస్

భువనేశ్వర్: కొత్త సంవత్సరం ఆరంభం పురస్కరించుకుని స్వామివారి దర్శనం కోసం భక్తులు పూరీని సందర్శిస్తారు. భక్తుల రద్దీ నియంత్రణ, సజావుగా దర్శనం ఏర్పాట్లు కోసం శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి (సీఏవో) రంజన కుమార్ దాస్ అధ్యక్షతన సేవా సబ్ కమిటీ ప్రత్యేకంగా శనివారం సమావేశమైంది. దీనిలో భాగంగా ఆరోజు జరగనున్న పలు ప్రత్యేక సేవలకు సంబంధించి కార్యక్రమాలు ఖరారు చేశారు. రాత్రి 11 గంటలలోపు ఏకాంత సేవ ముగియకుంటే పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయించారు. జనవరి 1న ఉదయం శ్రీమందిర ప్రాంగణం సందర్శకులతో రద్దీగా ఉంటే పగటి పూట స్వామి విరామం రద్దు చేస్తారు. అలాగే సమావేశంలో సంక్రాంతి కార్యక్రమాలను సైతం ఖరారు చేశారు.

పాహిలి భోగొ

ఏటా ధనువు సంక్రాంతి పురస్కరించుకుని శ్రీజగన్నాథుని పాహిలి భోగొ సేవ ప్రారంభమవుతుంది. ఈ సేవతో మకర సంక్రాంతి సేవ, దేవాభిషేక పూర్ణిమ సేవలు కార్యక్రమాలు ఖరారు చేశారు. ఈనెల 16వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనువు సంక్రాంతి సేవలు నిరవధికంగా నిర్వహిస్తారు. ఈ వ్యవధిలో నిత్యం రాత్రి 2 గంటలకు శ్రీమందిరం తలుపులు తెరుస్తారు. అనంతరం అంతరాలయం శుద్ధి ముగించి రాత్రి 2.45 గంటలకు మంగళ హారతి ఇస్తారు. ఉదయం 7 గంటలకు పాహిలి భోగొ సేవ ముగిస్తారు. ధనుర్మాసం నెల రోజులు రాత్రి 11 గంటలకు ఏకాంత సేవ జరుగుతుంది.

మకర సంక్రాంతి

జనవరి 15వ తేదీన వేకువ జామున 3 గంటలకు శ్రీ మందిరం తలుపులు తెరుస్తారు. 3.45 గంటలకు మంగళ హారతి సమర్పిస్తారు. రాత్రి 10.30 గంటలకు బొడొ సింగారం అలంకరణ చేసి రాత్రి 12 గంటలకు ఏకాంత సేవ చేపడతారు.

దేవాభిషేక సేవ

జనవరి 25న దేవాభిషేక పూర్ణిమ. ఈ సందర్భంగా వేకువజామున 3 గంటలకు శ్రీ మందిరం తలుపులు తెరిచి, అంతరాలయం శుద్ధి చేసి 4 గంటలకు మంగళ హారతి సమర్పిస్తారు. ఆ రోజున స్వామికి పుష్పాలు, ధనుషరలు, ఆయుధ అలంకరణ చేస్తారు. రాత్రి 11 గంటలకు బొడొ సింగారం అలంకరణ చేసి రాత్రి 12 గంటలకు ఏకాంత సేవ సమయం ఖరారు చేశారు. సమావేశంలో జిల్లా మేజిస్ట్రేట్ సమర్థ వర్మ, సేవా విభాగం అధికారి జితేంద్ర సాహు, శ్రీ మందిరం పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

106 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

కొరాపుట్: జిల్లాలోని మాచ్‌ఖండ్ పోలీసులు 106 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తోటపుట్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సమయంలో రవాణాకు సిద్ధంగా ఉన్నటువంటి 5 బస్తాల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను ముందే పసిగట్టిన స్మగ్లర్లు పరారయ్యారు. గంజాయిని సీజ్ చేసి మేజిస్ట్రేట్ ముందు ఉంచారు.

పైపుల డిపోలో అగ్ని ప్రమాదం



మంటల్లో కాలిపోతున్న పైపులు

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితి ఖురిగా గ్రామానికి సమీపంలోని పెట్రోల్ బంక్‌కు దగ్గరలో ఉన్నటువంటి ప్లాస్టిక్ పైపుల డిపోలో అగ్ని ప్రమాదం సంభవించింది. శనివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనలో లక్షలాది రుపాయులు విలువ చేసే పైపులు కాలి బూడిదయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కాసీపూర్ సమితిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి అవసరమైన ప్లాస్టిక్ పైపులను ఖురిగా సమీపంలోని పెట్రోల్ బంక్ దగ్గరలో ఉంచారు. అయితే అక్కడ ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో మంటల్లో పైపులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే పైపులు మంటల్లో కాలిపోయినట్లు తెలిసింది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గుడారి ప్రాంతంలో పులి సంచారం



పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అధికారులు, స్థానికులు



పులి పాదముద్ర

రాయగడ: గత కొద్ది రోజులుగా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న పెద్దపులి తాజాగా మళ్లీ గుడారి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మహారాష్ట్ర అడవుల నుంచి వచ్చిన పెద్దపులి మొదట్లో గజపతి జిల్లాలో సంచరించింది. అనంతరం రాయగడ జిల్లాలోని మునిగుడ, చంద్రపూర్, బీజాపూర్, డంగొసొరొడ, తెలంగాపాదొరొ, దొయికాల్ ప్రాంతాల్లో కలకలం సృష్టించింది. అయితే శుక్రవారం గుడారి ప్రాంతంలో పెద్దపులి తిరుగుతున్నట్లు ఆ ప్రాంత ప్రజలు అనుమానించడంతో సమాచారం తెలుసుకున్న గుడారి అటవీ శాఖ సిబ్బంది రెండు బృందాలుగా పాదముద్రలు వెతకడం ప్రారంభించారు. దీంతో గుడారి అటవీ ప్రాంతంలో శనివారం పులి అడుగును గుర్తించారు. ఈ క్రమంలో గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు రేంజర్ దిలీప్ పట్నాయక్ తెలియజేశారు. రాత్రి సమయాల్లో ఎవరూ బయట తిరగవద్దని హెచ్చరించారు.

పేద విద్యార్థులకు ఉచితంగా నర్సింగ్ సీట్లు

శ్రీకాకుళం రూరల్: ఎంసెట్‌లో పాసై, నీట్ పరీక్ష రాసిన పేద విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు ఉచితంగా కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నాలుగేళ్ల కోర్సు పూర్తి చేసిన అనంతరం వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి కోర్సు ఫీజును జీతం నుంచి మినహాయిస్తామన్నారు. డిగ్రీ పాసైన వారికి మూడు నెలలు పాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశా లు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రాగోలులో గల జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్ కార్యాలయాన్ని లేదా 7680945357, 91219 99654 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆలివ్ రిడ్లే సంరక్షణకు చర్యలు

- క్షిపణి పరీక్షల నిలిపివేతకు అభ్యర్థన
- పరీక్షలతో సంతానోత్పత్తిపై ప్రభావం
- హై పవర్ కమిటీ సమావేశంలో వార్షిక కార్యాచరణ ఖరారు



సముద్రంలో సంచరిస్తున్న ఆలివ్ రిడ్లే తాబేలు

భువనేశ్వర్: ప్రస్తుతం అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే సముద్ర తాబేళ్ల సంభోగ సీజన్ పురస్కరించుకుని ఫిబ్రవరి, మార్చి నెలల్లో రాష్ట్ర తీరంలో జరిగే క్షిపణి పరీక్షలను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అధికారులను కోరింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అధ్యక్షతన జరిగిన హై పవర్ కమిటీ సమావేశం అనంతరం ఈ విషయం వెల్లడైంది. ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంభోగం, సామూహిక అండ ప్రక్రియ, పొదగడం నేపథ్యంలో వార్షిక కార్యాచరణ ఈ సమావేశంలో ఖరారు చేశారు.

సంతానోత్పత్తిపై ప్రభావం

సామూహికంగా గుడ్లు పెట్టే సమయంలో ఎటువంటి క్షిపణి పరీక్షలను నిర్వహించవద్దని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థని అభ్యర్థించారు. ఈ పరీక్షలు సముద్ర తాబేళ్ల సంతానోత్పత్తి ప్రక్రియపై విపరీత ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. సముద్ర తాబేళ్ల గుడ్లు పెట్టేందుకు గూడు కట్టుకునే సమయంలో అటవీ శాఖతో మెరుగైన సమన్వయం కోసం నోడల్ అధికారిని నామినేట్ చేయాలని డీఆర్‌డీవోని కోరారు. ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణకు సంబంధించిన సంబంధిత జిల్లా అటవీ శాఖ అధికారుల (డీఎఫ్‌ఓ)కు సహకరించాలని ఆయా కోస్తా జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లకు రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అటవీ విభాగం సిబ్బందితో పాటు సముద్ర పహరా కోసం మత్స్య, జంతు వనరుల అభివృద్ధి విభాగం కూడా ఇండియన్ కోస్ట్ గార్డ్‌తో పని చేస్తుంది.

సమన్వయంతో పనిచేయాలని తీర్మానం

గంజాం జిల్లా రుషికుల్య నది ముఖ ద్వారం వద్ద సముద్ర తాబేళ్ల పరిశోధన, సంరక్షణ కేంద్రం ఏర్పాటు కోసం బరంపురం డీఎఫ్‌వో, గంజాం కలెక్టర్‌తో సమన్వయంగా పని చేయాలని సమావేశంలో తీర్మానించారు. అంతేకాకుండా మత్స్య శాఖ అభివృద్ధి చేసిన సెక్యూర్ ఫిషింగ్ మొబైల్ అప్లికేషన్, నో ఫిషింగ్ జోన్ గుర్తించడం కోసం మత్స్యకారుల్లో విస్తృతంగా ప్రచారం చేపడతారు. గత సీజన్ 2022 – 23లో గంజాం జిల్లా రుషికుల్య రూకరీలో రికార్డు స్థాయిలో 6.56 లక్షల తాబేళ్ల గుడ్లు పెట్టగా, గహిర్మట్ తీరంలో 5.12 లక్షల తాబేళ్లు సామూహికంగా గూడు కట్టేందుకు తరలి వచ్చాయి. సమావేశాన్ని సమన్వయం చేసిన ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటీర్ ఆఫ్ ఫారెస్ట్ (వన్యప్రాణి), చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ సుశాంత నంద మాట్లాడుతూ గహిర్మట్‌లో తాబేలు గూడు స్థలం వీలర్ ద్వీపానికి చాలా దగ్గరగా ఉంది. ఈ ద్వీపంలో క్షిపణి పరీక్షలు సముద్ర తాబేళ్లను కలవరపరచి మళ్లించే అవకాశం ఉంది. కాబట్టి, గూడు కట్టుకునే కాలంలో క్షిపణి పరీక్షను పరిమితం చేయాలని అభ్యర్థించినట్లు వివరించారు.

ఉమ్మడి గస్తీ

సముద్ర తాబేళ్ల సంతానోత్పత్తి సీజన్‌లో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు అటవీ శాఖ సిబ్బందితో ఉమ్మడి సముద్ర గస్తీ కోసం హోం శాఖ 7 విభాగాల ఏపీఆర్ దళాలను కేటాయిస్తుంది. రాజ్‌నగర్‌కు 4 ఏపీఆర్ యూనిట్లు, భద్రక్, పూరీ, బరంపురం తీర ప్రాంతాలకు ఒక్కో ఏపీఆర్ యూనిట్లు కేటాయిస్తారు. తాలొచువా, ధామ్రా వద్దనున్న మెరైన్ పోలీసులు అటవీ శాఖతో కలిసి సముద్రంలో గస్తీ నిర్వహించే సమయంలో సముద్ర నౌకలను అందిస్తారు. ధామ్రా, గోపాల్‌పూర్‌లోని ఓడరేవు అధికారులు సముద్ర పెట్రోలింగ్ కోసం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్లు, రాజ్‌నగర్, బరంపురం ప్రాంతానికి ఒక్కొక్కటి చొప్పున అద్దెకు తీసుకున్న సముద్రపు ట్రాలర్‌ను అందిస్తారు. పారాదీప్ పోర్ట్ అథారిటీ అటువంటి ట్రాలర్‌ను మడ అడవుల విభాగం (వన్యప్రాణి) రాజ్‌నగర్‌కు అందిస్తుంది.

చేపల వేట నివారణకు చర్యలు

తాబేళ్ల సంభోగ సీజనులో సముద్రంలో చేపల వేట పూర్తిగా నిషేధించారు. ఈ మేరకు సముచిత పరిహారం మత్స్యకారులకు విడుదల చేస్తారు. ఇటీవల ఈ పరిమితిని విస్తరించారు. ఈ మేరకు మత్స్యకారులను చైతన్యపరచాలని సమావేశంలో నిర్ణయించారు. అక్రమంగా చేపల వేటకు వెళ్తే తక్షణ చర్యలు చేపడతారు. ఈ నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న పడవల కోసం ఇండియన్ కోస్ట్ గార్డ్, అటవీ విభాగం, మత్స్య విభాగానికి పారాదీప్, గోపాల్‌పూర్, ధామ్రా ఓడరేవు అథారిటీలు తాత్కాలిక బెర్తింగ్ సౌకర్యాలను ఉచితంగా అందిస్తాయి.

రైల్వే ఆక్రమణలు తొలగింపు

- అడ్డుకోవడానికి వ్యాపారస్తుల ప్రయత్నం
- 45 దుకాణాలు తొలగింపు
- నెలాఖరు నాటికి పూర్తిగా తొలగిస్తాం: అధికారులు



జేసీబీతో దుకాణాలు తొలగిస్తున్న దృశ్యం



మోహరించిన పోలీసు బలగాలు



పర్యవేక్షిస్తున్న అధికారులు



కలెక్టర్‌కు సమస్యలు చెబుతున్న వ్యాపారస్తులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నటువంటి దుకాణాల తొలగింపు కార్యక్రమానికి రైల్వే అధికారులు శనివారం శ్రీకారం చుట్టారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలను మోహరించారు. ఇక్కడ కొంతమంది గత కొన్నేళ్లుగా రైల్వే స్థలాలను ఆక్రమించుకొని, దుకాణాలు నిర్మించుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో మెయిన్ మార్కెట్ వద్దనున్న దుకాణాలను బుల్డోజర్ల సాయంతో అధికారులు తొలగించారు. రైల్వే క్రాసింగ్ గేటు పాయింట్ నుంచి సుమారు 145 దుకాణాలు రైల్వే స్థలంలో ఉన్నట్లు అధికారులు గుర్తించి, ఇదివరకే వాటిని ఖాళీ చేయాలని వ్యాపారస్తులకు ముందస్తుగా నోటీసులు జారీ చేశారు. అయితే తమకు వేరే ప్రాంతంలో స్థలాలను కేటాయించాలని, లేదంటే ఖాళీ చేసేదిలేదని వ్యాపారస్తులు పట్టుబట్టారు. వ్యాపారస్తుల మొండి వైఖరిని ఖండిస్తూ రైల్వే అధికారులు శనివారం పూర్తి బందోబస్తుతో తొలగించేందుకు సన్నాహాలు చేశారు. వ్యాపారస్తులు అడ్డుకోవడంతో కొంతమేర ఇరువర్గాల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. అమృత్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ మునిగుడ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి పరిచేందుకు గుర్తించిన నేపథ్యంలో స్టేషన్ అభివృద్ధి దృష్ట్యా తొలగింపుపై నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో 45 దుకాణాలను తొలగించారు. ఈ నెల చివరి నాటికి మిగతా దుకాణాలను తొలగించడం తప్పదని రైల్వే అధికారులు తెలియజేశారు.

తొలగింపు అనివార్యం: కలెక్టర్ సింగ్

రైల్వేస్టేషన్ పరిసరాల ఆక్రమణలను తొలగిస్తుండడంతో వ్యాపారస్తులు కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్‌ను కలిశారు. ఒక కార్యక్రమం కోసం మునిగుడ వెళ్లిన ఆమె, ఆక్రమణలు తొలగిస్తున్న ప్రాంతానికి వెళ్లారు. దీంతో బాధితులు ఆమెను కలిసి తొలగింపులు ఆపమని వేడుకున్నారు. అయితే స్టేషన్ అభివృద్ధి దృష్ట్యా తొలగింపు అనివార్యమని ఆమె బాధితులకు వివరించారు. రైల్వే స్థలాన్ని వారు తీసుకోవడం తప్పదని, అందువల్ల వ్యాపారస్తులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ఐదుగురు నిందితులు అరెస్ట్



అరెస్టైన నిందితులు

బరంపురం: గంజాం జిల్లాలోని ఛమ్మఖండి పోలీసుస్టేషన్ పరిధి కల్లిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బరహా బసంత సత్తపతి హత్యా నేరానికి సంబంధించి ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ జగ్‌మోహన్ మీనా తెలిపిన వివరాల మేరకు.. కల్లిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి డిల్లేశ్వర్ పాత్రోపై క్రికెట్ బ్యాట్‌తో 3వ తేదీన గ్రామ క్రీడా మైదానంలో ప్రత్యర్థి వర్గం సభ్యులు దాడిచేసి పరారయ్యారు. అనంతరం బరంపురం ఎంకేసీజీలో చికిత్స పొందుతూ డిల్లేశ్వర్ పాత్రో మృతి చెందాడు. దీనిపై చమ్మఖండి పోలీసుస్టేషన్‌లో హత్య కేసు నమోదు చేసి ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో జె.కల్యాణి పాత్రో, బి.బుల్లు పాత్రో, హెచ్.విక్కి కుమార్ పాత్రో, బి.చిన్నయ్య పాత్రో, సీహెచ్ శేఖర్ పాత్రోలు ఉన్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

రాజీయే రాజమార్గం



జయపురం: కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర



పర్లాకిమిడి: జిల్లా కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న దృశ్యం



రాయగడ: కేసులు పరిశీలిస్తున్న న్యాయవాదులు

రాయగడ: పలు కేసుల్లో రాజీయే రాజమార్గమని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని కాసీపూర్, బిసంకటక్, గుణుపూర్ జిల్లా కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా 1760 కేసులను పరిష్కరించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్ జిల్లా న్యాయ సహాయ సంస్థ అధ్యక్షుడు నివేదిత పండా ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు జడ్జి అమృత్ రంజన్ నందో, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎస్‌కే జహీరా అహ్మద్, అదనపు జిల్లా జడ్జి రీనా చౌదరి, చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మీనాక్షి ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: జిల్లా కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌ను జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ ప్రారంభించారు. పలు విభాగాల్లో కేసుల విచారణ జిల్లా లీగల్ సర్వీసెస్ ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా పర్యవేక్షణలో జరిగింది. లోక్ అదాలత్‌లో మొత్తంగా 951 కేసులుకు గాను 138 కేసులు జిల్లా కోర్టు సముదాయంలో పరిష్కరించారు. అలాగే వివిధ బ్యాంకుల్లో కస్టమర్ల లోన్ల ఎగవేతల కేసులు 837కి గాను 80 కేసులు పరిష్కరించారు. కార్యక్రమాల్లో అదనపు జిల్లా జడ్జి ప్రదీప్ కుమార్ సామల్, ముఖ్య విచారణాధికారి నరోత్తమ శెఠి, సబ్ జడ్జి సంతోష్ కుమార్ అగర్వాల్, సబ్ డివిజనల్ విచారణ అధికారి బిష్ణుప్రియా సామంతరాయ్ తదితరులు పాల్గొన్నారు.

జయపురం: స్థానిక జిల్లా కోర్టుతో పాటు కొరాపుట్, కోట్‌పాడ్, బొరిగుమ్మ, సెమిలిగుడ, దశమంతపూర్, లమతాపుట్, లక్ష్మీపూర్ తదితర కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. కొరాపుట్ జిల్లాలో 372 కేసులు పరిష్కరించారు. జిల్లా జడ్జి, న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షులు సత్యనారాయణ మిశ్ర ప్రారంభించిన కార్యక్రమంలో స్వతంత్ర విజిలెన్స్ జడ్జి రాజేష్ ఎక్కా, ఫ్యామిలీ కోర్టు జడ్జి డా.పవిత్ర మోహన్ సామల్, అదనపు జిల్లా జడ్జి, సివిల్ కోర్టు జడ్జి, పోస్కో జడ్జి సీహెచ్ విశ్వనాథ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

కో-ఆర్డినేటర్ల నియామకం



పట్నాన గౌరి శంకర రావు (ఫైల్)

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన అమో ఒడిశా నవీన్ ఒడిశా కార్యక్రమానికి కో-ఆర్డినేటర్లను నియమించింది. ముఖ్యమంత్రి కార్యాలయం ఈ మేరకు 16 మంది కో-ఆర్డినేటర్ల జాబితాను శనివారం విడుదల చేసింది. రాష్ట్రంలో కార్యక్రమం పక్కాగా అమలు జరిగేలా నియామకాలు చేపట్టడం జరిగిందని ప్రకటనలో పేర్కొంది. అనుగూల్‌కు కైలాస్ చంద్ర సాహు, బాలేశ్వర్‌కు రంజన్ బాగ్, భద్రక్‌కు సంజయ్ దాస్, గజపతికి యరగాన రామభద్రరావు, భవానీపట్నం సబ్ డివిజన్ (కలహండి)కు బద్రీనారాయణ పట్నాయక్, ధర్మఘర్ సబ్ డివిజన్ (కలహండి)కు ఆదిత్యనంద, కందమాల్‌కు రాజీవ్ పాత్రో, ఖుర్ధకు శ్రీమయి శ్వేతాసింగ్ మిశ్ర, కొరాపుట్ సబ్ డివిజన్ (కొరాపుట్)కు లతా సాహు, జయపురం సబ్ డివిజన్ (కొరాపుట్)కు తులసీ కిరసాని, మల్కన్‌గిరికి చిత్తా పట్నాయక్, రాయ్‌రంగపూర్ సబ్ డివిజన్ (మయూర్‌భంజ్)కు అమరేంద్ర కర్, బరిపద సబ్ డివిజన్ (మయూర్భంజ్)కు సునీల్ కుమార్ దాస్, నవరంగపూర్‌కు మంజుల మాఝి, నయాఘర్‌కు గంగాధర్ పండ, నువాపడకు రామ్‌లాల్ హంస, రాయగడకు పట్నాన గౌరిశంకర్‌రావు, సంబల్‌పూర్‌కు సిద్ధాంత్ దాస్, సుందర్‌ఘడ్ సబ్ డవిజన్ (సుందర్‌ఘడ్)కు జోగేంద్ర సింగ్‌లు నియమితులయ్యారు. రాయగడ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన గౌరి శంకర్‌కు అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇసుక అక్రమాలపై ఆందోళన

- రహదారికి అడ్డంగా కర్రలు కట్టిన మహిళలు
- నిలిచిన వందలాది ఇసుక వాహనాలు



కమల్‌పూర్ ప్రాంతంలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లాలో ఇసుక అక్రమార్కుల ఆగడాలకు గ్రామీణ మహిళలు అడ్డుకట్ట వేసేందుకు విజృంభించారు. ఇసుక అక్రమ తరలింపు మార్గంలో వెదురు కర్రలు రోడ్డుకు అడ్డంగా కట్టి వ్యతిరేకత ప్రదర్శించారు. దీంతో కమల్‌పూర్ నది ఒడ్డున వందలాది ఇసుక రవాణా వాహనాలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో భువనేశ్వర్ వెళ్తున్న బింఝార్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే, శాసన సభ స్పీకర్ ప్రమీలా మల్లిక్ కారు సైతం చిక్కుకుంది. అయితే స్పీకర్ వాహనాన్ని సురక్షితంగా రాజధాని నగరం వైపు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళ్తే.. జాజ్‌పూర్ మండలం ఖరస్రోత నది ఒడ్డు ప్రాంతం రహదారి పరిస్థితి ఇసుక అక్రమ రవాణాతో దయనీయంగా తయారైంది. ఈ మార్గంలో నిరంతర ఇసుక తరలింపు కారణంగా ఈ పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. దీనికి నిరసనగా శనివారం ఆందోళనకు దిగారు. నదీతీరం బురదమయం కావడంతో స్థానికులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. నదీ కరకట్టను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించింది. కానీ స్థానికులకు బదులు ఇసుక అక్రమదారులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో ఇంతకుముందు ఇందుకు నిరసనగా, వందలాది మంది గ్రామస్తులు ఖరస్రోత నదీతీర ప్రాంతం కమల్‌పూర్, బొందాముండా ఘాట్‌ల పరిసరాల్లో ఇసుక పోసి ఇసుక అక్రమ రవాణా వాహనాలను అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తం అయింది. ఈ సందర్భంగా పట్టణ పోలీసులు నిరసనను అణిచివేసేందుకు 19 మంది గ్రామస్తులను జైలుకు తరలించారు. తాజాగా మార్కండ్‌పూర్, బాసుదేబ్‌పూర్ పంచాయతీ మహిళలు కమల్‌పూర్‌లో రోడ్డుపై వెదురు దడి కట్టి రోడ్డును దిగ్బంధించారు. ఇసుక లోడు హైవా వాహనాలను రోడ్డు ఎక్కనీయకుండా అడ్డుకున్నారు. దీంతో ఈ మార్గంలో ఇరువైపులా ఇసుక తరలింపు వాహనాల కదలిక స్తంభించిపోయింది. ఇసుక అక్రమ రవాణాపై అధికార యంత్రాంగం మౌనం వహించడంపై వివిధ వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

• 10,300 కలాలతో క్రిస్మస్ ట్రీ



టి.లింగాలుపాడు పంచాయతీ పరిధి సీతారామపురం చర్చ్‌లో శనివారం పాస్టర్ తమ్మినేని రవిబాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. 10,300 పెన్నులతో తయారు చేసిన క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

–జలుమూరు

విందు భోజనంలో అపశ్రుతి



మరణించిన తెప్పల జానకమ్మ (ఫైల్)



నల్లబొడ్లూరులో పర్యటిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- ఒకరు మృతి

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరు గ్రామంలో శుక్రవారం జరిగి న ఓ శుభ కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. రాత్రి విందు తిన్న వారిలో పలువురు అస్వస్థతకు గురయ్యారు. వారిలో భేతాళపురం గ్రామానికి చెందిన తెప్పల జానకమ్మ(35) అనే మహిళ మృతి చెందా రు. పూర్తి వివరాల్లోకి వెళితే.. నల్లబొడ్లూరు గ్రామంలో శుక్రవారం ఓ వివాహ రిసెప్షన్ ఫంక్షన్ జరిగింది. అతిథులకు రాత్రి కూడా భోజనాలను ఏర్పాటు చేశారు. ఆ విందులో చికెన్ కర్రీ తిన్నవారు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన సుమారు 18 మంది అస్వస్థతకు గురికాగా, ఫంక్షన్‌కు వచ్చిన భేతాళపురం, రాంపురం, బిడిమి, నల్లబొడ్లూరు, పెద్దనల్లబొడ్లూరు తదితర గ్రామాలకు చెందిన మరో 15 మంది కూడా అనారోగ్యానికి గురయ్యారు. బాధితుల్లో కొంత మంది ఆయా గ్రామాల్లో వైద్య చికిత్స తీసుకున్నా రు. కొంతమందిని హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రం, పలాసలో ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లా రు. హరిపురంలో సీహెచ్‌సీలో డాక్టర్ ప్రకాశవర్మ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. పెద్దనారాయణపురం,భేతాళపురం, దున్నవూరు, రాణిగాం గ్రామాలకు చెందిన ఒ.జానకిరావు, జుత్తు దాన మ్మ, దున్న కవిత, కళ్లేపల్లి గౌతమ్, దున్న రమేష్, నల్లబొడ్లూరుకు చెందిన బొడ్డు హేమవతి, గిరి, చంటి, తనూజ, బొడ్డు హేమ, లిఖిత తదితరులు చికి త్స పొందారు. భేతాళపురం గ్రామానికి చెందిన తెప్పల జానకమ్మ(35) ఆరోగ్య పరిస్థితి విషమించ డంతో ఆమెను శనివారం శ్రీకాకుళం తరలిస్తుండగా దారిలో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్పందించారు. నల్లబొడ్లూరులో వైద్య శిబిరం నిర్వహించాలని మందస పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావును ఆదేశించారు. గ్రామంలో శనివారం పర్యటించి, బాధితుల వివరాలు, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి వద్దకే వైద్యం అందిస్తామన్నారు. మంత్రితో పాటు ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ బొడ్డు శాంతిప్రియ, ఉదయ్, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సొర్ర డిల్లేశ్వరరావు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: పట్టణంలోని ఉడా కాలనీ కవితాబార్ వద్దనున్న గాయత్రీ బేకరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు అక్కడకు చేరుకుని విచారణ చేయగా మృతుడి వయసు సుమారు 45 నుంచి 55 ఏళ్ల వ్యక్తి అని తెలిసిందన్నారు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామన్నారు. బంధువులెవరైనా గుర్తిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ బి.వెంకటరావు తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

- 1200 లీటర్ల బెల్లపు ఊట, 40 లీటర్ల సారా ధ్వంసం
- ఎస్‌ఈబీ సీఐ ఉపేంద్ర


బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ సిబ్బంది

పార్వతీపురం టౌన్: ఆంధ్రా - ఒడిశా రాష్ట్ర సరిహద్దుల్లో సారా తయారీ కేంద్రాలు ఉన్నాయన్న ముందస్తు సమాచారంతో వాటిని గుర్తించి శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించామని ఎస్‌ఈబీ సీఐ ఎల్.ఉపేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండలం కొత్తవలస గ్రామంలో సారా తయారీ చేస్తున్న పీడిక అసు అలియాస్ వాసు అనే వ్యక్తి ఒడిశా ప్రాంతం నుంచి వలస వచ్చి కొత్తవలస గ్రామంలో ఉంటూ సారా తయారు చేస్తున్నారని ఆయన తెలిపారు. సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లపు ఊట, 40లీటర్ల సారాను ధ్వంసం చేసి అసుపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జుడీషియల్ మెజిస్ట్రేట్ వారి ముందు హాజరు పరిచామని తెలిపారు. దాడుల్లో ఎస్ఐ వీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


పసగడ ముగడమ్మ (ఫైల్)

మెరకముడిదాం: రాజాం, రామభద్రపురం ప్రధాన రహదారిలో మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో పసగడ ముగడమ్మ(73) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బాడంగి మండలం ముగడ గ్రామానికి చెందిన పసగడ ముగడమ్మ అనే వ్యక్తి శుభ కార్యక్రమానికి బంధువులను పిలిచేందుకు మెరకముడిదాం మండలంలో పలు గ్రామాలకు శుక్రవారం వెళ్లాడు. తిరిగి తన ఇంటికి బయలుదేరి వెళ్తుండగా శుక్రవారం రాత్రి రాజాం, రామభద్రపురం ప్రధాన రహదారిలో ఉత్తరావల్లి జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ముగడమ్మ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మృతదేహం గుర్తు తెలియనంతగా నుజ్జయ్యింది. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న ముగడమ్మ కుమారుడు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధరాయవలస ఎస్ఐ నవీన్‌పడాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు

- లారీని తప్పించబోయి కాలువలోకి దూసుకెళ్లిన బస్సు


ప్రమాదానికి గురైన కేవీఆర్ ట్రావెల్స్ బస్సు

బొండపల్లి: విజయవాడ నుంచి పార్వతీపురం వస్తున్న కేవీఆర్ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు ఎదురుగా వేగంగా వస్తున్న లారీని తప్పించబోయి జాతీయ రహదారి 23కు అనుకొని ఉన్న సాగునీటి కాలువలోకి శనివారం ఉదయం దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. బస్సు ముందు నుంచి ప్రయాణికులు రావడానికి వీలు లేకపోవడంతో ఎమర్జెన్సీ డోర్ తెరిచి బయటపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం కారణంగా బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జయ్యింది. ప్రమాద సమయంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు.

పరిశోధనకు ప్రభుత్వ సాయం

రైతు సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న రాష్ట్రంలోని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ సంస్థల అభివృద్ధికి కూడా తన వంతు సాయం చేస్తోంది. ఇందులో భాగంగా గాజులరేగలోని వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధికి చేయూతనందిస్తోంది. ప్రభుత్వ సాయంతో పరిశోధన స్థానంలో కొత్త రకం వంగడాల అభివృద్ధిలో శాస్త్రవేత్తలు దూసుకువెళ్తున్నారు.

- నాలుగున్నరేళ్లలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- పరిశోధన స్థానంలో చిరుధాన్యాలపై పరిశోధనలు
- మిల్లెట్ సెకండరీ ప్రాసెసింగ్, బిస్కెట్ కటింగ్ యూనిట్లు ఏర్పాటు
- ఇప్పటికే కొత్త చోడి వంగడాలను అందించిన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు


వ్యవసాయ పరిశోధన స్థానం


కురుకురే రోస్టర్


కురుకురే తయారు చేసే మిషను

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయ రంగం అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పంట పెట్టుబడికి నిధులు అందజేస్తోంది. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతుల ముంగిటకే విత్తనాలు, ఎరువులు అందిస్తోంది. ముఖ్యంగా రైతు పండించిన పంటను కూడ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. రైతుకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని, నూతన వంగడాలను అందించే గాజులరేగలోని వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధికి కూడా ప్రభుత్వం సాయాన్ని అందిస్తోంది. పరిశోధన స్థానం అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం అందించింది. వ్యవసాయ పరిశోధన స్థానంలో చిరుధాన్యాలపై పరిశోధనలు చేస్తున్నారు. ఇక్కడ అభివృద్ధి చేసిన వంగడాలు జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందాయి.

1996 నుంచి ఇక్కడ పరిశోధనలు

1996వ సంవత్సరంలో ప్రభుత్వం 22.67 ఎకరాలను కొనుగోలు చేసి పరిశోధన స్థానానికి అప్పగించింది. దీంతో అప్పటి నుంచి ఇక్కడ పరిశోధనలు చేస్తున్నారు. ఇందులో రెండు ఎకరాల్లో భవనాలు ఉండగా 20 ఎకరాల్లో పరిశోధనలు చేస్తున్నారు.

కొత్తగా రాగి, సజ్జ, ఉలవ కొత్త వంగడాలు

వ్యవసాయ పరిశోధన స్థానంలో చిరుధాన్యాలు రాగి (చోడి), సజ్జ, ఉలవ పంటలకు సంబంధించి పలు రకాల నూతన వంగడాలను ఇప్పటికే అందించారు. చోడికి సంబంధించి 9 వంగడాలను, సజ్జకు సంబంధించి రెండు రకాలను, ఉలవ పంటకు సంబంధించి ఒక రకాన్ని అందించారు. చోడి పంటకు సంబంధించి 2019లో వేగావతి రకాన్ని అభివృద్ధి చేశారు. 2020లో సువర్ణముఖి, ఇంద్రావతి రకాలను అభివృద్ధి చేశారు. ఇందులో ఇంద్రావతి రకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు. 2022లో గోస్తానీ రకాన్ని విడుదల చేశారు. సజ్జకు సంబంధించి విజయ కంపోజిట్, విశాఖ కంపోజిట్ రకాలను అందించారు. ఉలవ పంటకు సంబంధించి వీజెడ్‌ఎం – 1 రకాన్ని అందించారు. అంతేకాకుండా చిరుధాన్యాలు, వరి, మొక్కజొన్న వంటి పంటలకు ఆశించే తెగుళ్లపై నిరంతరం పరిశోధనలు చేస్తున్నారు.

అవసరం మేరకు నిధులు



వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులను అందిస్తోంది. మిల్లెట్ సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్, బిస్కెట్ కట్టర్ వంటి యూనిట్లు ఏర్పాటు చేశారు. నిరంతరం పరిశోధనలు చేసి రైతులకు అధిక దిగుబడిని ఇచ్చే నూతన వంగడాలను అందిస్తున్నాం.

– డాక్టర్ నర్సుపల్లి అనురాధ, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు

వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులను వెచ్చిస్తోంది. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులను విడుదల చేసింది. వీటిలో పాల యూనిట్లు ఏర్పాటు చేయడంతో పాటు గిరిజన ప్రాంత రైతులకు విత్తనాలను, రైతులకు అవసరమైన వివిధ ప్రయోజనకరమైన పరికరాలను అందిస్తోంది. చిరుధాన్యాల పంట ఉత్పత్తులను నేరుగా విక్రయిస్తే కొనుగోలుకు పెద్దగా వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో ఉప ఉత్పత్తులు పౌడర్లు, బిస్కెట్లు, మిక్సర్ వంటివి తయారు చేసి విక్రయిస్తే చిన్న పిల్లలు సైతం కొనుగోలుకు ముందుకు వస్తారు. మిల్లెట్ సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్, రవ్వ మేకింగ్ మిల్, బిస్కెట్ కట్టర్, మిల్లెట్ పఫ్ బాల్స్ మిషన్ యూనిట్లును ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం రైతులకు చిరుధాన్యాల విత్తనాలను కూడా రాయితీపై అందిస్తోంది. వీటితో నాటు కోళ్ల పెంపకానికి సంబంధించి బ్రూడర్లు, ఇంకుబేటర్, మల్లిప్లేక్సులు వంటివి అందిస్తున్నారు.

గొప్ప ఆర్థిక వ్యవస్థగా భారత్


న్యూ అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న టాటాసన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్

రాజాం: ఒకప్పుడు భారత్ కేవలం ఒక ఆర్థిక శక్తిగా ఉండేదని, త్వరలో భారత్ గొప్ప ఆర్థిక వ్యవస్థగా మారనుందని టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, పద్మభూషణ్ నటరాజన్ చంద్రశేఖరన్ నటరాజన్ అన్నారు. రాజాంలో జీఎంఆర్ ఐటీ కళాశాలను ఆయన శనివారం సందర్శించారు. తొలుత జీఎంఆర్ ఐటీ న్యూ అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఐటీ విద్యార్థులు ప్రదర్శించిన బిజినెస్ పెర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ ఏ 1 పవర్డ్ చాట్ ఎన్‌లైజర్, ఏ1 సాంకేతికతలను ఉపయోగించి వాయిస్ అసిస్టెంట్‌లతో కూడిన సంజ్ఞ నియంత్రిత వర్చువల్ మౌస్, కీ బోర్డు, విజన్ బేస్డ్ పైనాపిల్ మెచ్యూర్టి, క్వాలిటీ మోనటరింగ్ సిస్టమ్ వంటి ఐటీ ప్రదర్శనలు తిలకించారు. అనంతరం ఐటీ విద్యార్థులు, జీసీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, జీఎంఆర్ డీఏవీ విద్యార్థులతో పాటు ఐటీ అధ్యాపకులు, జీఎంఆర్ కేర్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. సమ్మిళిత వృద్ధి ఆవశ్యకతను వివరించిన చంద్రశేఖరన్, ప్రపంచంలో శ్రామిక జనాభాలో మూడింట రెండొంతుల మందితో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ మారనుందని అన్నారు. నాణ్యమైన సౌకర్యాలతో పాటు అంకితభావంతో కూడిన అధ్యాపకులతో అత్యుత్తమ సంస్థలో భాగమైనందుకు జీఎంఆర్ ఐటీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన ఆయన విద్యార్థి దశలో తలచుకుంటే ఏమైనా సాధించగలరని వివరించారు.

జీఎంఆర్ సేవలు అద్భుతం..

అంతకు ముందు జీఎంఆర్ గ్రూపు సేవలపై నటరాజన్ చంద్రశేఖరన్ మాట్లాడారు. విద్య, ఆరోగ్యం, సమాజ సేవలపై జీఎం రావు చేస్తున్న కృషి చాలా గొప్పదని వెల్లడించారు. ఇక్కడి జీఎంఆర్ ఐటీ విద్యార్థులు దేశ విదేశాల్లో అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్ పొందారని అన్నారు. ఈ సందర్భంగా జీఎంఆర్ ఐటీ విద్యార్థులతో పాటు జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు, డీఏవీ స్కూల్ విద్యార్థులను అభినందించారు. జీఎంఆర్ గ్రూప్స్ అధినేత జీఎంఆర్ మాట్లాడుతూ జీఎంఆర్ వీఎఫ్ స్థాపన, సేవలను వివరించారు. నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న సామాజిక, ఆర్థిక పరివర్తన కార్యక్రమాలు, ఉపాధి కల్పన కార్యక్రమాలపై వివరించారు. నటరాజన్ చంద్రశేఖరన్‌ను బొబ్బిలి వీణ, పొందూరు ఖాదీతో సత్కరించారు. కార్యక్రమంలో జీఎంఆర్ గ్రూప్స్ ఎయిర్ పోర్ట్స్ విభాగం బిజినెస్ చైర్మన్ జీబీఎస్ రాజు, రవాణా, ఇన్ఫ్రా బిజినెస్ చైర్మన్ బీవీఎన్ రావు, జీఎంఆర్ సోదరులు గ్రంధి నీలాచలం, గ్రంధి చినవెంకటేశ్వర్లు, సీఈఓ అశ్విని లోహని, కోఆర్డినేటర్ ఎల్ఎమ్ లక్ష్మణమూర్తి, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో దొంగల హల్‌చల్

- పోలీసుల ఇళ్లను వదల్లేదు
- ఒకే రాత్రి మూడు చోట్ల దొంగతనం
- తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
- ఆందోళనలో పట్టణ ప్రజలు


సంఘటనా స్థలం పరిశీలిస్తున్న ఎస్ఐ శివప్రసాద్


నగదు కోసం దొంగలు చెల్లాచెదురు చేసిన బీరువా

పాలకొండ: ప్రజలకు కష్టం కలిగితే పోలీసుల వద్దకు వెళ్తారు.. మరి పోలీసులకు కష్టం కలిగితే ఎవరి వద్దకు వెళ్తారు.. అనే సినిమా డైలాగ్ ఇప్పుడు పాలకొండ పట్టణంలో వినిపిస్తుంది. ఇందుకు కారణం దొంగలు పోలీసుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఇంట్లో ఉన్న సొత్తును దోచుకుపోవడమే కారణం. ఒకే రాత్రి పట్టణంలో మూడు ఇళ్లలో తాళాలు బద్దలు కొట్టి దొరికిన కాడికి దోచుకుపోయిన సంఘటన పాలకొండలో సంచలనంగా మారింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం దిశ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఎస్ఐ లావణ్య ఇంట్లో చొరబడి బంగారు అభరణాలు, నగదు దోచుకెళ్లారు. విధుల నుంచి శనివారం ఉదయం ఇంటికి వచ్చిన ఆమె దొంగతనం జరిగిటనట్టు గుర్తించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే పంచాయతీరాజ్ కార్యాలయంలో పని చేస్తున్న గార కాంతారావు ఇంటి తాళాలు పగులగొట్టి రూ.2లక్షల నగదు, మూడు తులాల బంగారు లాభరణాలు దోచుకున్నారు. డీఎస్పీ కార్యాలయం వెనుకే ఒక ఇంట్లోలో ముగ్గురు కానిస్టేబుల్స్ అద్దెకు ఉంటున్నారు. ఆ ఇంటి తాళం కూడా విరగ్గొట్టి అందిన కాడికి దోచుకున్నారు. బాధితులు దొంగతనం జరిగినట్టు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో క్లూస్ టీమ్‌ను రప్పించి పరిశీలించారు. ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేసి, సంఘటనా స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

లారీ ఢీకొని అయ్యప్పస్వామి భక్తుడు దుర్మరణం

పీలేరు రూరల్: లారీ ఢీకొని అయ్యప్పస్వామి భక్తుడు దుర్మరణం చెందిన సంఘటన పీలేరు - రాయచోటి జాతీయ రహదారి రాయలవారిపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మన్యం జిల్లా పాచిపేట మండలం మాతుమూరు గ్రామానికి చెందిన ఆవుల నారాయణ (60) తోటి అయ్యప్పస్వామి భక్తులతో కలసి ఈ నెల 6న ఇరుముడి కట్టి టూరిస్టు బస్సులో శబరిమలై యాత్ర ప్రారంభించారు. శ్రీశైలం తదితర పుణ్య క్షేత్రాలు చూసుకుంటూ శనివారం ఉదయం పీలేరు సమీపంలోని రాయలవారిపల్లె వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడానికి రోడ్డు పక్కన బస్సు ఆపారు. నారాయణ రోడ్డు దాటే క్రమంలో రాయచోటి వైపు నుంచి వచ్చిన సిమెంట్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ మోహన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.చింతలవలస వద్ద అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ శనివారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన బి.పెంటయ్యపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని మేదరిబంద జంక్షన్ వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల బియ్యం పట్టుకుని, వాహనాన్ని సీజ్ చేశామని ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, గొల్లపల్లి అజయ్, కేతల ధనుంజయ్‌లను అదుపులోకి తీసుకుని, విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

13 వరకు భాగవత సప్తాహం

బాడంగి: మండలంలోని కోడూరు రామమందిరంలో ఈ నెల 13వ తేదీ వరకు భాగవత సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొల్లి కూర్మినాయుడు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఏడు రోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ భగవద్గీత సారాంశం, భగవద్గీతలోని ముఖ్య శ్లోకాలను వివరించడం జరుగుతోందన్నారు. దీని ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: స్థానిక ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న అక్రమాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి, కాలనీని సందర్శించి, పలుచోట్ల ఆక్రమణలు జరుగుతున్న విషయం తెలుసుకున్నారు. మొదటి లేఅవుట్‌లోని 45, 628, 634, 635 సర్వే నంబర్లలో ఖాళీ స్థలాలను విక్రయించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు.

అధునాతన శిక్షణతో ప్రయోజనం


గౌరవ వందనం స్వీకరిస్తున్న అడిషనల్ డీజీ రవికిరణ్

- అడిషనల్ డైరెక్టర్ జనరల్ రవికిరణ్

విజయనగరం క్రైమ్: అధునాతన పద్ధతుల్లో శిక్షణ తీసుకోవడం ఎంతో ఉపయోగకరమని విశాఖ నాసిన్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఈ.రవికిరణ్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ శిక్షణా కళాశాలలో మూడు వారాల పాటూ కస్టమ్స్ హవల్దార్స్ 57 మందికి శిక్షణ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా శనివారం హాజరయ్యారు. పాసింగ్ అవుట్ పరేడ్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు వారాల పాటూ ఫిజికల్, ఆర్మ్స్, ఫైరింగ్ విభాగాల్లో నేర్చుకున్న శిక్షణ మీ జీవితానికి పునాది వంటిదన్నారు. సర్వీస్ కాలంలో శిక్షణ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పివి.అప్పారావు మాట్లాడుతూ ఇండోర్, అవుట్‌డోర్‌లో ప్రత్యేక శిక్షణ అందజేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ జెఎం.కిశోర్, అసిస్టెంట్ డైరెక్టర్ గిరిధర్, సూపరింటెండెంట్ టి.పణిధర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

గజపతినగరం రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ ఏర్పాటుకు వినతి


కేంద్ర రైల్వేశాఖ మంత్రికి వినతి పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని

బొండపల్లి: గజపతినగరం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా ఫ్లైఓవర్ నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. వేపాడ మండలం వీలుపర్తిలో జరిగిన వికసిత్‌భారత్ సంకల్పయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన రైల్వే మంత్రిని విశాఖపట్నం విమానాశ్రయంలో ఆమె కలిశారు. ఇక్కడ రైల్వే గేటు వల్ల కలిగే ఇబ్బందులు, ఫ్లైఓవర్ ఆవశ్యకతను వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ రైల్వే గేటు ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని విశాఖపట్టణం డివిజనల్ రైల్వే మేనేజర్‌కు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు పావని తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



సబ్ జూనియర్స్ విభాగంలో విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

- రెండవ రోజు కొనసాగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు
- సబ్ జూనియర్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం

విజయనగరం: జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, క్యాడెట్ బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలు రెండవ రోజు శనివారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో గల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో బాల, బాలికలు పోటాపోటీగా తలపడ్డారు. పూర్తిగా ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌తో పారదర్శకంగా నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించటంలో ఉత్సాహాన్ని కనబరిచారు. ఇదిలా ఉండగా రెండవ రోజు సాయంత్రానికి సబ్ జూనియర్స్ విభాగంలో బాల, బాలికలకు పోటీలు ముగియగా.. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. సబ్ జూనియర్స్ విభాగంలో విజయనగరం, ప్రకాశం, తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆదివారం మూడవ రోజు క్యాడెట్ విభాగంలో పోటీలు నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేయటం జరుగుతుందని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డివి.చారి ప్రసాద్ తెలిపారు. పోటీలను ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ మోహన్, టోర్నీ చైర్మన్, సీతం విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముద్దాడ మధు, గదుల సత్యలత, తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు

- విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు

విజయనగరం: విద్యార్థి దశలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ నెల 11 నుంచి జిల్లా వేదికగా నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బాక్సింగ్ పోటీలను విజయవంతం చేయాలని డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ కోరారు. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణపై రాజీవ్ ఇండోర్ స్టేడియంలో వ్యాయామ ఉపాధ్యాయులతో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ఈ నెల 11, 12, 13 తేదీల్లో రాజీవ్ క్రీడామైదానంలోని బాక్సింగ్‌రింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్-14, 17, 19 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించే పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 800 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. పోటీల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వసతి, భోజన సదుపాయాల్లో ఎటువంటి లోటుపాట్లకు తావివ్వకూడదని చెప్పారు. సమావేశంలో వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.5లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత


బాధిత కుటుంబానికి రాజాంలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: పట్టణంలోని కొండంపేట గ్రామానికి చెందిన నగిరెడ్డి సునీత మృతి చెందగా, ఆమె భర్త నగిరెడ్డి సూరిబాబుకు రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే కంబాల జోగులు రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శనివారం అందజేశారు. నగిరెడ్డి సునీత అనారోగ్యంతో అస్వస్థతకు గురైంది. ఆమె వైద్యం కోసం కుటుంబ సభ్యులు అప్పులు చేసినా, బతికించుకోలేకపోయారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం ఎమ్మెల్యే జోగారావు దృష్టికి రావడంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. దీంతో రూ.5 లక్షల సాయం మంజూరైంది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి కంబాల సందీప్, రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు సలాది తులసీరావు, ముద్దన సత్యారావు, శాసపు వేణుగోపాలనాయుడు, కెల్ల సతీష్, గొర్లె దాలినాయుడు, సూరపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.